క్లుప్తంగా

శ్రావణ శుక్రవారం పూజలు



కుంకుమపూజ చేస్తున్న మహిళలు

చందుర్తి: మండలంలోని మల్యాల శ్రీవేంకటేశ్వరస్వామి సన్నిధిలో శ్రావణ మొదటి శుక్రవారం పూజలు చేపట్టారు. ఆలయ అర్చకులు కందాళై వెంకటరమణాచార్యులు ఆధ్వర్యంలో నిర్వహించిన కుంకుమ పూజలకు గ్రామంలోని మహిళ భక్తులు స్వామివారి సన్నిధికి చేరుకుని పూజలో పాల్గొన్నారు. సుమారు రెండు గంటల పాటు నిర్వహించిన పూజలు, మంగళ హారతుల పాటలతో ఆలయ ప్రాంగణం హోరెత్తిపోయింది. గ్రామంలో శ్రావణ మాసం సందడి కనిపించింది.

నేల రకాలను బట్టి పంటలు సాగుచేయాలి



పంటల పటాన్ని ప్రదర్శిస్తున్న విద్యార్థులు

ఎల్లారెడ్డిపేట: నేల సారవంతాన్ని బట్టి పంటలు సాగు చేస్తే అధిక దిగుబడులు సాధించవచ్చని డీఏఏటీటీసీ కేంద్రం శాస్త్రవేత్త రాజేంద్రప్రసాద్ అన్నారు. మండల కేంద్రంలోని రైతు వేదికలో శుక్రవారం ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ రాష్ట్ర వ్యవసాయ కళాశాల, జగిత్యాల కళాశాల విద్యార్థులు గ్రామీణ ప్రాంతాల్లో సామాజిక వనరుల పటం, పంటల నిష్పత్తి, నేల రకాలు, వ్యవసాయ కాలచక్రం తదితర విషయాలపై రైతులకు అవగాహన కల్పించారు. రైతులు ఆరు తడి పంటలపై ఎక్కువగా దృష్టిసారించాలన్నారు. నేల రకాలను బట్టి పంటలు సాగు చేస్తే వేసే పంటలు రోగాల నుంచి రక్షణ పొందుతాయన్నారు. కార్యక్రమంలో ఏఈవో శ్రీశైలం, విద్యార్థులు, రైతులు పాల్గొన్నారు.

బీజేపీ ఆధ్వర్యంలో రాస్తారోకో



రాస్తారోకోలో నినాదాలిస్తున్న నాయకులు

సిరిసిల్లటౌన్: బీజేపీ రాష్ట్ర నాయకత్వం పిలుపు మేరకు శుక్రవారం జిల్లా కేంద్రం సిరిసిల్లలో రాస్తారోకో నిర్వహించింది. స్థానిక అంబేద్కర్ చౌరస్తాలో నిర్వహించిన కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర కార్యవర్గసభ్యులు లగిశెట్టి శ్రీనివాస్ మాట్లాడుతూ సర్కారు ఎన్నికల మేనిఫెస్టోలో ఇచ్చిన హామీలు నెరవేర్చలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. మున్సిపల్ మాజీ చైర్మన్ ఆడెపు రవీందర్, వెంకటేశ్వర్‌రెడ్డి, హన్మంత్‌గౌడ్, జిల్లా ప్రధాన కార్యదర్శి గోపి పాల్గొన్నారు.

రెండో ఏఎన్ఎంలకు సంఘీభావం

నిరవధిక దీక్షలకు దిగిన రెండో ఏఎన్ఎంలకు బీజేపీ నేతలు సంఘీభావం తెలిపారు. ప్రభుత్వం వెంటనే వారి డిమాండ్లను నెరవేర్చాలని ప్లకార్డులతో ప్రదర్శన జరిపారు.

గృహలక్ష్మి వరిస్తుందా?

- ఇందిరమ్మ లబ్ధిదారుల ఎదురుచూపు
- పట్టాలిచ్చి ఏళ్లు గడుస్తున్నా గూడు కరువు
- అద్దె ఇళ్లలో వెళ్లదీస్తున్న లబ్ధిదారులు
- డబుల్ బెడ్రూంకు అర్హత నిరాకరణ



తంగళ్లపల్లి: తెలంగాణ రాష్ట్ర ఏర్పడడం జిల్లాలో అందరికి ఆనందాన్ని ఇస్తే ఇందిరమ్మకాలనీలో పట్టాలు పొందిన లబ్ధిదారులకు మాత్రం నిరాశనే మిగిల్చిందని చెప్పాలి. కొత్త రాష్ట్రంతోపాటు కొత్త ప్రభుత్వం ఏర్పడి అప్పటికే అమలవుతున్న ఇందిరమ్మ పథకాన్ని పట్టించుకోకపోవడం దానికి తోడు ఇళ్ల నిర్మాణంలో లబ్ధిదారులకు అండగా నిలుస్తున్న హౌజింగ్ బోర్డును రద్దుచేయడంతో బిల్లుల చెల్లింపు నిలిచిపోయింది. ఇందిరమ్మ పథకాన్ని రద్దు చేసిన సీఎం కేసీఆర్ ప్రభుత్వం డబుల్ బెడ్రూం పథకాన్ని ప్రతిష్ఠాత్మకంగా నెత్తినెత్తుకుంది. అయితే ఇందిరమ్మ పథకంలో నివేశన స్థలాలు పొందిన లబ్ధిదారులకు మాత్రం డబుల్ బెడ్రూం పథకం వర్తించదని మెలిక పెట్టింది. దీంతో ఇళ్లు నిర్మించుకునే స్థోమత లేక వందల మంది లబ్ధిదారులు ఏళ్లుగా అద్దె ఇళ్లలో వెళ్లదీస్తున్నారు.

ఇందిరమ్మ పూర్తికాదు.. డబుల్ బెడ్రూం అర్హత లేదు

ఇందిరమ్మ పథకంలో భాగంగా నివేశన స్థలాల పట్టాలు పొందిన లబ్ధిదారుల పరిస్థితి రెంటికి చెడ్డ రేవడిలా తయారయ్యింది. నివేశన స్థలాల పట్టాలను ఆధార్ కార్డుతో అనుసంధానం చేయడంతో వారు డబుల్ బెడ్‌రూం పథకానికి అర్హత లేకుండా పోయారు. సరే ఉన్న 75 గజాల స్థలంలో అయినా గూడు నిర్మించుకుంటాం ప్రభుత్వం నుంచి ఆర్థికసాయం చేయండి మహాప్రభో.. అంటూ ఎన్ని ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ తిరిగినా, ఎంతమంది అధికారులకు, ఎమ్మెల్యేలు మంత్రులకు మొరపెట్టుకున్నా పట్టించుకునే నాథుడే కరువయ్యాడని వాపోతున్నారు.

గృహలక్ష్మిపైనే కొండంత ఆశ

రాష్ట్ర ప్రభుత్వం డబుల్ బెడ్రూం పథకం స్థానాన్ని భర్తీ చేస్తూ కొత్తగా గృహలక్ష్మి పథకాన్ని పట్టాలెక్కించింది. సొంత జాగ ఉండి ఇళ్లు లేని రేషన్ కార్డు కలిగిన నిరుపేదలందరికీ గృహలక్ష్మి పథకం ద్వారా ఆర్‌సీసీ స్లాబ్‌తో ఇళ్లు నిర్మించుకునేందుకు ఒక్కో లబ్ధిదారుడికి రూ.3 లక్షలు ఇస్తామని ప్రకటించింది. దీంతో ఇందిరమ్మ లబ్ధిదారుల్లో కొత్త ఆశలు చిగురించాయి. ఖాళీ జాగా ఉండి తాము ఇళ్లు నిర్మించుకోలేని పరిస్థితిలో ఉన్నామని కాబట్టి గృహలక్ష్మిని తమకు కూడా వర్తింపజేయాలని కోరుతున్నారు.

బోలెడు దరఖాస్తులు

ఇందిరమ్మ పథకంలో భాగంగా నివేశన స్థలాల పట్టాలు పొందిన వందలాది మంది లబ్ధిదారులు గృహలక్ష్మి పథకం కొరకు దరఖాస్తు చేసుకున్నారు. గతంలో ఇందిరమ్మకాలనీ లేకపోవడంతో అప్పటి మండెపల్లి, సారంపల్లి గ్రామాల పేరుతోనే లబ్ధిదారులకు పట్టాలు అందజేశారు. తంగళ్లపల్లి మండల వ్యాప్తంగా 1,889 గృహలక్ష్మి దరఖాస్తులు రాగా వాటిలో మండెపల్లి 82, సారంపల్లి 40, ఇందిరమ్మకాలనీ 645 దరఖాస్తులు వచ్చాయి. అత్యధికంగా ఇందిరమ్మకాలనీలో 645 దరఖాస్తులు రాగా అత్యల్పంగా పాపయ్యపల్లె గ్రామంలో కేవలం ఒక్క దరఖాస్తు మాత్రమే వచ్చినట్లు అధికారుల గణాంకాలు చెబుతున్నాయి.

అద్దె ఇంట్లోనే వెళ్లదీస్తున్నాం



ఇందిరమ్మకాలనీ గ్రామం పరిధిలో అప్పటి కాంగ్రెస్ ప్రభుత్వం ఇందిరమ్మ ఇంటి పథకం ద్వారా 75 గజాల నివేశన స్థలాన్ని కేటాయించింది. కానీ తెలంగాణ వచ్చాక పథకం రద్దు కావడంతో ఇళ్లు నిర్మించుకోలేక అద్దె ఇంటిలోనే వెళ్లదీస్తున్నాం.

– చిలివేరి శ్రీలత, ఇందిరమ్మకాలనీ

గృహలక్ష్మి వర్తింపజేయాలి



సీఎం కేసీఆర్ రాష్ట్రంలో అన్ని వర్గాల ప్రజలకు మేలు చేస్తున్నారు. స్థానిక మంత్రి కేటీఆర్ ప్రత్యేక చొరవచూపి ఇందిరమ్మ పథకం లబ్ధిదారుల సొంతింటి కలను నిజం చేయాలి. రూ.3 లక్షలు ఇస్తే ఇళ్లు నిర్మించుకుంటాం.

– చిందం లక్ష్మి, ఇందిరమ్మకాలనీ

ఆదేశాలు లేవు



ఇందిరమ్మ పథకం లబ్ధిదారులను గృహలక్ష్మీ పథకానికి ఎంపిక చేసే విషయంలో ఎటువంటి స్పష్టమైన ఆదేశాలు రాలేదు. ఉన్నతాధికారులు ఎలా ఆదేశిస్తే అలా చేస్తాం. అత్యధికంగా ఇందిరమ్మకాలనీలో 645 దరఖాస్తులు వచ్చింది వాస్తవమే.

– పి.లచ్చాలు, ఎంపీడీవో, తంగళ్లపల్లి

జోహార్ పాపన్న

వేములవాడ: బడుగు బలహీన వర్గాల ఆశాజ్యోతి సర్వాయి సర్దార్ పాపన్నగౌడ్ జయంతిని జిల్లా వ్యాప్తంగా ఘనంగా నిర్వహించారు. వేములవాడ మార్కెట్‌యార్డు ముందున్న పాపన్న విగ్రహానికి మున్సిపల్ చైర్‌పర్సన్ రామతీర్థపు మాధవి, బీజేపీ జిల్లా అధ్యక్షుడు ప్రతాప రామకృష్ణ, కౌన్సిలర్లు గడ్డమీది లావణ్య, సంతోష్‌బాబు, గౌడ సంఘం నాయకులు తిరుమల్‌గౌడ్, రాజగోపాల్‌గౌడ్ పాల్గొన్నారు.

సిరిసిల్లఅర్బన్: సిరిసిల్ల మున్సిపల్ పరిధి చిన్నబోనాలలో నిర్వహించిన కార్యక్రమంలో కౌన్సిలర్ బొల్గం నాగరాజ్‌గౌడ్, నేరేళ్ల శ్రీనివాస్‌గౌడ్, పరుశరామ్‌గౌడ్ పాల్గొన్నారు.

వేములవాడఅర్బన్: వేములవాడ మండలంలోని సంకెపల్లి, రుద్రవరం, చంద్రగిరి గ్రామాల్లో గౌడ సంఘం నాయకులు లక్ష్మిరాజం, రాజేశం, బుర్ర శేకర్‌గౌడ్, దశగౌడ్, రవి, మహేశ్, సురేందర్ పాల్గొన్నారు.

ఎల్లారెడ్డిపేట: మండల కేంద్రంతో పాటు వెంకటాపూర్, రాచర్లగొల్లపల్లిలో నిర్వహించిన కార్యక్రమంలో బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు తోట ఆగయ్యతో పాటు జిల్లా గౌడ సంఘం అధ్యక్షుడు చిదుగు గోవర్ధన్‌గౌడ్, గౌడ సంఘం మండల అధ్యక్షులు గంట శ్రీనివాస్‌గౌడ్, కార్తీక్‌గౌడ్ పాల్గొన్నారు.

వేములవాడరూరల్: మండలంలోని నూకలమర్రి, మర్రిపల్లి తదితర గ్రామాల్లో నిర్వహించిన కార్యక్రమంలో గౌడ సంఘం నాయకులు పాల్గొన్నారు.

చందుర్తి: మండలంలోని జోగాపూర్, చందుర్తి, బండపల్లి గ్రామంలో నిర్వహించిన వేడుకల్లో జెడ్పీటీసీ నాగం కుమార్, గౌడ సంఘం మండల అధ్యక్షుడు సంపునూరి మురళీధర్‌గౌడ్, గౌడ సంఘం నాయకులు పాల్గొన్నారు.



ముస్తాబాద్: ఆవునూర్‌లో విగ్రహావిష్కరణ



వేములవాడలో..



వేములవాడరూరల్: మర్రిపల్లిలో..



చందుర్తి: జోగాపూర్‌లో



కోనరావుపేట: సుద్దాలలో విగ్రహావిష్కరణ



ఎల్లారెడ్డిపేటలో..

పాపన్న విగ్రహాల ఆవిష్కరణ

కోనరావుపేట: మండలంలోని సుద్దాలలో సర్దార్ సర్వాయి పాపన్న విగ్రహాన్ని సర్పంచ్ ఉప్పుల దేవలక్ష్మి, ఉపసర్పంచ్ ఎరవెల్లి నాగరాజు ఆవిష్కరించారు. సింగిల్‌విండో వైస్ చైర్మన్ కాశవేణి మహేశ్, ఉప్పుల శంకర్ పాల్గొన్నారు. మండలంలోని నిమ్మపల్లి, కోనరావుపేట, మల్కపేట, ధర్మారం, బావుసాయిపేటలో నిర్వహించిన వేడుకల్లో ఎంపీపీ చంద్రయ్యగౌడ్, సింగిల్‌విండో డైరెక్టర్ జవ్వాజి దేవయ్య, నాయకులు పాల్గొన్నారు.

ముస్తాబాద్: మండలంలోని ఆవునూర్‌లో సర్దార్ సర్వాయి పాపన్న విగ్రహాన్ని బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు తోట ఆగయ్య శుక్రవారం ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఎంపీపీ శరత్‌రావు, జెడ్పీటీసీ నర్సయ్య, సెస్ డైరెక్టర్ అంజిరెడ్డి, సింగిల్‌విండో చైర్మన్ బాపురావు, సర్పంచ్ కల్యాణి, ఎంపీటీసీ లలిత పాల్గొన్నారు. ముస్తాబాద్, గూడెం, బందనకల్ గ్రామాల్లో నిర్వహించిన వేడుకల్లో గౌడ సంఘం మండల అధ్యక్షుడు బాలరాజుగౌడ్, పట్టణ అధ్యక్షుడు శ్రీనివాస్‌గౌడ్, ఎంపీటీసీ శ్రీనివాస్‌గౌడ్, తదితరులు పాల్గొన్నారు.

బోయినపల్లి: స్థానిక బస్టాండ్ ప్రాంతంలో నిర్వహించిన వేడుకల్లో మాజీ జెడ్పీటీసీ, రాష్ట్ర గౌడ సంఘం నాయకుడు పులి లక్ష్మీపతి పాల్గొన్నారు.

వీర్నపల్లి: మండల కేంద్రంలో నిర్వహించిన వేడుకల్లో గౌడ సంఘం అధ్యక్షుడు నేరళ్ల కృష్ణహరి, సర్పంచ్ పాటి దినాకర్, ఎంపీటీసీ అరుణ్‌కుమార్, తదితరులు పాల్గొన్నారు.

సమాచారం

22న గురుకుల కళాశాలల్లో ఖాళీల భర్తీకి డెమోలు

సిరిసిల్లకల్చరల్: జిల్లాలోని నర్మాల, బోయినపల్లిలోని సాంఘిక సంక్షేమ గురుకుల కళాశాలల్లో ఖాళీగా ఉన్న బోటనీ, కెమిస్ట్రీ లెక్చరర్ పోస్టుల భర్తీకు అర్హులైన అభ్యర్థుల నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు జిల్లా సమన్వయ అధికారిణి బి. జాక్వెలిన్ ఒక ప్రకటనలో తెలిపారు. సంబంధిత సబ్జెక్టుల్లో పీజీ, బీఈడీ విద్యార్హతలతో పాటు ఆసక్తి గల అభ్యర్థులు ఈ నెల 21లోపు చిన్నబోనాలలోని గురుకుల కళాశాలలో దరఖాస్తులు అందజేయాలన్నారు. 22న ఇంటర్వ్యూ, డెమో తరగతుల నిర్వహణ సామర్థ్యం ఆధారంగా ఎంపికైన అభ్యర్థులకు నెలకు రూ.23,400ల వేతనం అందజేస్తామన్నారు.

సమాచారం

కాంగ్రెస్ మండల కమిటీలు

తంగళ్లపల్లి: మండల కాంగ్రెస్ పార్టీలో శుక్రవారం తంగళ్లపల్లి ఫిషర్‌మెన్ కమిటీ అధ్యక్షుడిగా ఇటికల మహేందర్, బీసీ సెల్ ఉపాధ్యక్షుడిగా చిలుక శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శిగా ద్యారంగుల రాజు లను నియమించినట్లు మండల కాంగ్రెస్ అధ్యక్షుడు జాలగం ప్రవీణ్ (టోని) తెలిపారు.

కావేరి మండల సమాఖ్య కార్యవర్గం

ఎల్లారెడ్డిపేట: మండల సెర్ప్ కావేరి మండల సమాఖ్య అధ్యక్షురాలుగా బైరి జ్యోతిని ఎన్నుకున్నారు. ,ఉపాధ్యక్షురాలిగా మానస, కార్యదర్శిగా సుమలత, సహాయ కార్యదర్శులుగా రమ్య, తులసి, కోశాధికారిగా మీనా చైతన్య ఎన్నికయ్యారు. నూతన కార్యవర్గాన్ని అధికారులు అభినందించారు. ఈ కార్యక్రమంలో ఏపీయం మల్లేశం, వివిధ గ్రామాల మహిళ సమాఖ్య సభ్యులు పాల్గొన్నారు.

'సాక్షి' ఫొటోగ్రాఫర్‌కు అవార్డు



సిరిసిల్లక్రైం: తెలంగాణ ఫొటో జర్నలిస్టుల అసోసియేషన్ ఆధ్వర్యంలో ప్రపంచ ఫొటోగ్రఫీ దినోత్సవం సందర్భంగా నిర్వహించిన పోటీల్లో 'సాక్షి' సిరిసిల్ల ఫొటోగ్రాఫర్ వంకాయాల శ్రీకాంత్‌కు అవార్డు లభించింది. దీనికి సంబంధించిన వివరాలను అసోసియేషన్ వ్యవస్థాపక అధ్యక్షుడు జి.భాస్కర్ శుక్రవారం రాత్రి వెల్లడించారు. బెస్ట్ న్యూస్ ఫీచర్ విభాగంలో ఈ అవార్డు లభించినట్లు తెలిపారు. ఆవార్డును రవీంద్రభారతిలో ఈ నెల 20న సాయంత్రం 4 గంటలకు మంత్రి హరీశ్‌రావు చేతులమీదుగా అవార్డు అందుకోనున్నట్లు తెలిపారు. శ్రీకాంత్ అవార్డు రావడంపై తోటి జర్నలిస్టులు హర్షం వ్యక్తం చేశారు.

క్షీరాభిషేకం

ముస్తాబాద్: సీఎం కేసీఆర్ నూరు శాతం రైతు రుణమాఫీ చేసినందుకు హర్షం వ్యక్తం చేస్తూ పోతుగల్ సింగిల్‌విండో చైర్మన్ తన్నీరు బాపురావు అన్నారు. మండలం పోతుగల్ సింగిల్‌విండో కార్యాలయంలో సీఎం చిత్రపటానికి శుక్రవారం క్షీరాభిషేకం చేశారు. వైస్‌చైర్మన్ రాజేశంగౌడ్, డైరెక్టర్లు కట్ట బాపురావు, సతీష్‌చందర్, గన్నె నర్సింలు, సీఈవో కృష్ణ, మేనేజర్ రాజేశ్వర్‌రావు, రైతులు, సిబ్బంది పాల్గొన్నారు.

ఇళ్లులేని వారందరికీ గృహలక్ష్మి

ఎల్లారెడ్డిపేట: ఇళ్లు లేని వారికి సొంత ఖాళీ ప్రదేశంలో గృహలక్ష్మి పథకం ద్వారా ఇంటి నిర్మాణానికి ప్రభుత్వం రూ.3 లక్షల ఆర్థికసాయం అందిస్తుందని, ఈ అవకాశాన్ని నిరుపేదలు సద్వినియోగం చేసుకోవాలని మండల సర్పంచుల ఫోరం కన్వీనర్ కొండాపురం బాల్‌రెడ్డి అన్నారు. అధికారులతో కలిసి శుక్రవారం ఆయన గృహలక్ష్మి సర్వేను నిర్వహించారు. ఏవో చాద భూంరెడ్డి, సర్పంచ్ అమృత, ఎంపీటీసీ గీతాంజలి పాల్గొన్నారు.

కారు చోరీపై విచారణ

చందుర్తి: మండల కేంద్రంలోని కారు ఎత్తుకెళ్లినట్లు అనుమానిస్తున్న ఇద్దరు స్థానికులను పోలీసులు విచారిస్తున్నట్లు తెలిసింది. ఈ నెల 14న ఆర్ధరాత్రి కారును గుర్తు తెలియని వ్యక్తులు ఎత్తుకెళ్లారు. ఈ విషయమై బాధితుడు 15న ఫిర్యాదు చేశాడు. మండల కేంద్రంలోని నుంచి కారు ఎత్తుకెళ్లిన ఘటనను పోలీసులు సీరియస్‌గా తీసుకుని విచారణను వేగవంతం చేశారు. చందుర్తి సర్కిల్ పరిధిలో గల వివిధ పోలీస్‌స్టేషన్ పరిధిలోని గ్రామాల్లోని సీసీ కెమెరాలే కాకుండా జగిత్యాల జిల్లా కథలాపూర్, వేములవాడ, సిరిసిల్ల ప్రధాన రహదారుల వెంట ఉన్న సీసీ ఫుటేజీల ఆధారంతో పాటు అనుమానితుల కాల్‌డేటాతో పోలీసులు కారు ఆచూకీని తెలుసుకున్నట్లు తెలిసింది. చోరీకి గురైన కారు గంభీరావుపేట మండలం సముద్రలింగాపూర్ గ్రామంలో లభ్యమైనట్లు తెలుస్తోంది.

'రాజేశ్వరపురం నుంచి రాకపోకలు కొనసాగించాలి'



ఆలయ పరిసరాల్లో మూత్రవిసర్జన చేస్తున్న వ్యక్తి

వేములవాడ : రాజన్న ఆలయ పరిసరాలు అపరిశుభ్రంగా మారుతున్నాయి. ధర్మగుండం వద్ద సరైన సౌకర్యాలు, చర్యలు లేకపోవడంతో భక్తులు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారు. రాజేశ్వరపురం నుంచి రాకపోకలు నిలిపివేసి ధర్మగుండం పక్కనుంచి నడిచే అవకాశం కల్పించడంతో దుర్వాసన మధ్య వీఐపీలు, పుర ప్రముఖులు, భక్తులు ముక్కు మూసుకొని వెళ్లాల్సిన దుస్థితి నెలకొంది. అధికారులు పరిశీలించి రాజేశ్వరపురం నుంచి రాకపోకలను కొనసాగించేలా చర్యలు తీసుకోవాలని స్థానికులు, ప్రముఖులు కోరుతున్నారు.

'తప్పుడు ఆరోపణలు చేయొద్దు'



తహసీల్దార్‌తో మోహన్ కుటుంబ సభ్యులు

ఇల్లంతకుంట: మండలంలోని తిప్పాపూర్ గ్రామ పంచాయతీ పరిధిలోని దమ్మనిపల్లి గ్రామానికి చెందిన దమ్మని మోహన్ శుక్రవారం తన కుటుంబ సభ్యులతో కలిసి తహసీల్దార్‌ను కలిశారు. దమ్మనిపల్లి గ్రామంలో 171/1/12/2/1 సర్వే నెంబర్‌లో 0.8 గుంటల భూమి తనదేనని, గ్రామంలో ఫీల్డ్ అసిస్టెంట్‌గా పని చేస్తున్న దమ్మని లక్ష్మణ్, అతడి సోదరుడు బెజ్జంకి ఎంపీడీఓ దమ్మని రాము సలహాతో తన పట్టా భూమి లాక్కోవాలని చూస్తున్నారని ఆరోపించారు. దమ్మని లక్ష్మణ్ వద్ద ఎలాంటి ఆధారాలు లేకున్నా తన భార్య సర్పంచ్ పదవిలో కొనసాగుతుండంతో పాటు తన చేతిలో కొందరు ఉపాధిహామీ కూలీలను కలుపుకుని కుట్రలు చేస్తున్నారని అన్నారు. తన సొంత పట్టా భూమిలో క్రీడామైదానం బోర్డును తనకు తెలియకుండా ఏర్పాటు చేశారని, ఇదంతా తనపై ఫీల్డ్ అసిస్టెంట్ లక్ష్మణ్ కక్ష్య సాధింపు చర్యలో భాగమేనన్నారు.

సోలార్‌ప్లాంటు పరిశీలించిన రెడ్కో చైర్మన్

సిరిసిల్లటౌన్: జిల్లా ఆస్పత్రిలోని ఏర్పాటు చేసిన 40 కేవీ సోలార్‌ప్లాంటును తెలంగాణ రెడ్కో చైర్మన్ వై.సతీశ్‌రెడ్డి శుక్రవారం పరిశీలించారు. ఆస్పత్రి టాప్‌రూఫ్‌పై ఏర్పాటుచేసిన ప్లాంటును సంస్థ జీఎం ప్రసాద్, సోలార్ విభాగం ప్రాజెక్టు డైరెక్టర్ అమరేందర్‌రెడ్డితో కలిసి పరిశీలించారు. సతీశ్‌రెడ్డి మాట్లాడుతూ రాష్ట్రాన్ని కాలుష్యరహితంగా మార్చడానికి ప్రభుత్వం కృషి చేస్తుందని తెలిపారు. జిల్లా ఆస్పత్రిలో ప్రతి నెల 45 వేల యూనిట్ల విద్యుత్ వినియోగిస్తున్నారని, 40.కే.వీ సోలార్‌ప్లాంటు ద్వారా నెలకు 5,400 కిలోవాట్ల విద్యుత్ ఉత్పత్తి అవుతుందని వివరించారు. ప్రస్తుతం నెలకు రూ.1.25 లక్షల కరెంట్‌బిల్లు వస్తుందని, సోలార్ ప్లాంటు వినియోగంతో నెలకు రూ.54వేలు తక్కువగా వస్తుందని తెలిపారు. ఇరువై ఐదేళ్ల పాట్లు ప్లాంటు నిర్వహణను రెడ్కో సంస్థ చూస్తుందని తెలిపారు. ప్లాంటు వ్యయం నాలుగేళ్లలో తిరిగి వస్తుందని వివరించారు. రెడ్కో కరీంనగర్ ఉమ్మడి జిల్లా మేనేజర్ పరమాచారి, ఆస్పత్రి సూపరింటెండెంట్ మురళీధర్‌రావు ఉన్నారు. కాగా శుక్రవారం మంత్రి కేటీఆర్ చేతుల మీదుగా ప్రారంభించాల్సిన ఈ ప్లాంటు వివిధ కారణాలతో వాయిదాపడింది.

అధికారులు అప్రమత్తంగా ఉండాలి

- కలెక్టర్ అనురాగ్ జయంతి

సిరిసిల్లటౌన్: రాష్ట్రంలో భారీ వర్షాల నేపథ్యంలో అధికారులు అప్రమత్తంగా ఉండాలని కలెక్టర్ అనురాగ్ జయంతి పేర్కొన్నారు. ఈమేరకు శుక్రవారం ప్రకటన విడుదల చేసి మాట్లాడారు. కలెక్టరేట్‌లో రౌండ్ ది క్లాక్ పనిచేసే క్లాక్ రూం ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. భారీ వర్షాల నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని కోరారు. ఏదైన సహాయం కోసం 93986 84240లో సంప్రదించాలని కోరారు.

బండి సంజయ్‌ని కలిసిన నాయకులు



సంజయ్‌తో నాయకులు

బోయినపల్లి: బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శి బండి సంజయ్‌కు మార్‌ను శుక్రవారం బీజేపీ మండలాధ్యక్షుడు గుడి రవీందర్‌రెడ్డి ఆధ్వర్యంలో మండల నాయకులు కరీంనగర్‌లో మర్యాదపూర్వకంగా కలిశారు. సంజయ్‌ను శాలువాతో సన్మానించారు. నియోజకవర్గ కో–కన్వీనర్ ఉదారి నర్సింహచారి, సారంపల్లి రాజు, కొనకటి హరీశ్ ఉన్నారు.

పీఆర్‌టీయూ సభ్యత్వ నమోదు

వేములవాడఅర్బన్: వేములవాడ పట్టణంలోని ప్రభుత్వ పాఠశాలల్లో శుక్రవారం ఉపాధ్యాయులు పీఆర్‌టీయూ ఆధ్వర్యంలో సభ్యత్వం నమోదు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఉపాధ్యాయుల పెండింగ్ బిల్లులు, పీఆర్‌సీతో పాటు ఐఆర్ ఇచ్చుటకు ఈ సంఘం పరంగా కృషి చేస్తున్నమన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడు చిప్ప యాదగిరి, మదిశెట్టి మహేశ్, హన్మండ్లు, మధుకర్, రాంప్రభ, మహేశ్ పాల్గొన్నారు.

సంక్షిప్త వార్తలు

సమగ్రశిక్ష ఉద్యోగుల నిరసన

ఇల్లంతకుంట: స్థానిక ఎమ్మార్సీ కార్యాలయం ఎదుట సమగ్ర శిక్ష ఉద్యోగులు ముఖానికి నల్లగుడ్డలు కట్టుకుని నిరసన తెలిపారు. సీఆర్పీలు మల్లేశం, నర్సయ్య, హేమావతి, ఎంఐఎస్ రేణుక, సీసీవో భాగ్యలక్ష్మి పాల్గొన్నారు.

అంగన్‌వాడీ కేంద్రం ప్రారంభం

బోయినపల్లి: మండల కేంద్రంలో నూతన అంగన్వాడీ కేంద్రాన్ని ఎంపీపీ పర్లపల్లి వేణుగోపాల్ శుక్రవారం ప్రారంభించారు.

విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ ప్రారంభం

ఇల్లంతకుంట: మండలంలోని అనంతారం గ్రామ పంచాయతీ పరిధిలోగల రెడ్డివాడ గ్రామ శివారులో విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌ను సెస్ డైరెక్టర్ మల్లుగారి రవిందర్‌రెడ్డి ప్రారంభించారు.

కల్యాణలక్ష్మి చెక్కులు పంపిణీ

ఎల్లారెడ్డిపేట: మండలం రాచర్లతిమ్మాపూర్ గ్రామంలో లబ్దిదారులకు మంజూరైన కళ్యాణ లక్ష్మి చెక్కులను ఏఎంసీ మాజీచైర్మన్ సుభాష్ పంపిణీ చేశారు.

విధుల్లో చేరిన తహసీల్దార్

ఎల్లారెడ్డిపేట: ఎల్లారెడ్డిపేట తహసీల్దార్‌గా రాంచందర్ శుక్రవారం బాధ్యతలు చేపట్టారు. ఆదిలాబాద్ జిల్లా నుంచి బదిలీపై వచ్చారు. ఇక్కడ పనిచేస్తున్న జయంత్‌కుమార్‌కు బదిలీ అయినా ఉత్తర్వులు ఇంకా వెలువడలేదు.

పాఠశాలకు ఫ్యాన్లు అందజేత

కోనరావుపేట: స్థానిక జెడ్పీహెచ్ఎస్‌కు భారతీయ విద్యార్థి యువసేన రాష్ట్ర అధ్యక్షుడు పల్లెర్ల శేఖర్ సీలింగ్ ఫ్యాన్లు అందజేశారు.

ఆర్థికసాయం

ఎల్లారెడ్డిపేట: అనారోగ్యంతో మృతిచెందిన మండల కేంద్రానికి చెందిన సాకలి భూమయ్య కుటుంబానికి చేయూత మిత్ర ఫౌండేషన్ ఆధ్వర్యంలో రూ.10 వేల నగదు, బియ్యం అందజేశారు.

కార్మికుల కోసం వైద్య శిబిరం

వీర్నపల్లి: మండలంలోని గర్జనపల్లి గ్రామంలో కార్మికుల కోసం శుక్రవారం ఉచిత వైద్య శిబిరాన్ని జిల్లా కో–ఆర్డినేటర్ అనిల్‌కుమార్ ఏర్పాటు చేశారు. సర్పంచ్ కరుణ, నాయకులు పాల్గొన్నారు.

పోడు రైతుల సమస్య పరిష్కరించాలి

వీర్నపల్లి: పోడు రైతుల సమస్య పరిష్కరించాలని సీపీఐ రైతు సంఘం జిల్లా కార్యదర్శి జంగం అంజయ్య అన్నారు. మండలంలోని గర్జనపల్లి గ్రామంలో మాట్లాడారు. కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు గజ్జెల ప్రభాకర్ పాల్గొన్నారు.

నేడు 5కే రన్

సిరిసిల్లటౌన్: వయోజనులు ఓటరుగా నమోదు చేసుకోవాలన్న లక్ష్యంతో శనివారం ఉదయం సిరిసిల్లలో 5కే రన్ చేపడుతున్నట్లు ఆర్డీవో, ఎలక్ట్రోరల్ రిజిస్ట్రేషన్ అధికారి ఆనంద్‌కుమార్ తెలిపారు.

ఎంపీడీవోకు సన్మానం

తంగళ్లపల్లి: ఉత్తమ అధికారిగా అవార్డు అందుకున్న తంగళ్లపల్లి ఎంపీడీవో పి.లచ్చాలును శుక్రవారం ఉపాధిహామీ ఫీల్డ్ అసిస్టెంట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు.

ఎస్సైగా ఎంపికైన యువకుడికి సన్మానం

వేములవాడఅర్బన్: చందుర్తి మండలం ఎన్గల్‌కు చెందిన జవ్వాజి అరుణ్ ఎస్సైగా ఎంపికవగా.. వేములవాడలో బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు ఏనుగు మనోహర్‌రెడ్డి సన్మానించారు.

స్కూళ్లలో దోమల నివారణకు స్ప్రే

ఎల్లారెడ్డిపేట: మండలంలోని పాఠశాలల్లో దోమల నివారణకు పూలమొక్కలపై స్థానిక విజ్ఞాన్ ఇంగ్లిష్ మీడియం స్కూల్‌లో ప్రైమరీ స్కూల్ హెచ్ఎం సంతోష్ ఆధ్వర్యంలో కెమికల్ పిచికారీ చేయించారు.

ఈవీఎంలపై అవగాహన

బోయినపల్లి: మండలంలోని అనంతపల్లి, మల్కాపూర్ గ్రామాల్లో శుక్రవారం ఈవీఎం, వీవీప్యాట్ ద్వారా ఓటువేసే విధానంపై ఎన్నికల సిబ్బంది ప్రచారం నిర్వహించారు. ఈవీఎంల ద్వారా ఓటువేసే విధానంపై అవగాహన కల్పించారు. సర్పంచులు సత్యనారాయణరెడ్డి, నరేశ్, మండల ప్రణాళిక, గణాంక అధికారి పరమేశ్ పాల్గొన్నారు.